గతి తప్పిన మెప్మా

మెప్మా (పట్టణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ)అనే పేరు మహిళా సంఘాలకు కొత్తగా పరిచయం చేయాల్సిన పనిలేదు. మహిళలు ప్రతి నెలా సమావేశాలు పెట్టుకోవడం, మహిళా సంఘాల సంక్షేమం కోసం శ్రమించడం, బ్యాంకు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందడంలో మెప్మా కీలక పాత్ర పోషించాలి. కానీ చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని మెప్మా విభాగం మహిళల పాలిట శాపంగా మారిందనే ఆరోపణలు మూటకట్టుకుంటోంది.

- ఓ అధికారి వేధింపులతో మహిళ ఆత్మహత్యాయత్నం
- బ్యాంకు రుణాల్లో వాటాలు ఇవ్వలేదనే ప్రచారం
- కమీషన్ ఏజెంట్లుగా మారిన కొందరు ఆర్పీలు
- ఇంట గెలవక రచ్చకెక్కుతున్న చిత్తూరు 'మెప్మా'


చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయంలోని మెప్మా విభాగం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో మెప్మా కూడా ఓ విభాగంగా పనిచేస్తోంది. ఇందులో 17 వేలకు పైగా మహిళా సంఘాలుగా ఏర్పాటై, దాదాపు 32 వేల మందికి పైగా సభ్యులుగా ఉన్నారు. వీళ్లను పర్యవేక్షించడానికి ఏర్పడిన మెప్మా విభాగంలో ఓ సిటీ మిషన్ మేనేజరు, 110 మంది రిసోర్స్ పర్సన్లు, ఐదుగురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు పనిచేస్తున్నారు. ఇటీవల కాలంలో మెప్మా విభాగంలో ఇక్కడ పనిచేస్తున్న వాళ్లపై వేధింపుల పర్వం మొదలైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం ఓ మహిళా సిబ్బందిని, ఓ అధికారి వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించారు. విషయం బయటకు పొక్కకుండా కాళ్లు పట్టుకోవడంతో, బాధిత మహిళ కేసు పెట్టకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మెప్మా విభాగంలో పనిచేసే అధికారి వివాదాస్పద నిర్ణయాలు, ఒత్తిడి వల్లే ఈ విభాగం దారి తప్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కమీషన్లకు కక్కుర్తి

మహిళా సంఘాల ఆర్థికఅభివృద్ధి సాయం చేయాల్సిన మెప్మా విభాగంలో ప్రస్తుతం కమీషన్ల కోసం కొందరు కక్కుర్తి పడుతున్నారు. స్వయం సహాయక సంఘాలు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు పొందే సమయంలో కొందరు ఆర్పీలు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. పైగా వచ్చిన మామూళ్లలో మెప్మాలోని ఓ అధికారికి కమీషన్లు ఇవ్వాలంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇక రెండేళ్ల క్రితం మహిళా సంఘంలోని సొమ్ముల్లో అవినీతికి పాల్పడిందనే ఆరోపణలపై ఓ ఆర్పీని తొలగించారు. తాజాగా ఈ ఆర్పీని తీసుకొచ్చి మెప్మా విభాగంలో కీలక పదవిలో కూర్చోపెట్టారని విమర్శలు వస్తున్నాయి. ''గతంలో ఉన్న మెప్మా అధికారికి ఎంత ఇచ్చారు..? ఇప్పుడు నాకు ఎందుకు ఇవ్వరు..? గతంలో బ్యాంకు నుంచి రుణాలు తీసుకున్నప్పుడు ఎంత పర్సెంటేజీ మామూళ్లు ఇచ్చేవాళ్లు..?'' ఇలాంటి ప్రశ్నలతో మెప్మాలోని ఓ అధికారి వేధింపులకు గురిచేయడంతో తాళలేకపోతున్నట్లు కొందరు సిబ్బంది బహిరంగంగానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కు

మరోవైపు మహిళా సంఘాలకు బ్యాంకులు ఒక్కసారి రుణం మంజూరు చేసిన తరువాత దాన్ని 20 నెలల్లో నెలసరి కంతులుగా చెల్లిస్తారు. 20 నెలలకు కలిపి బ్యాంకులు వడ్డీ వసూలు చేస్తుంటాయి. కానీ కొందరు ఆర్పీలు బ్యాంకులో పనిచేస్తూ, కమీషన్ల కోసం దళారుల అవతారం ఎత్తి సిబ్బందితో కుమ్మక్కు అవుతున్నారు. 14 నెలలకే తీసుకున్న మొత్తాన్ని చెల్లించేసి, కొత్త రుణం ఇప్పిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మహిళా సంఘాలపై అధిక వడ్డీ భారం పడుతోందనే విషయం చెబుతున్నా పట్టించుకోవడంలేదు. తమకు రావాల్సిన కమీషన్ల కోసం కొందరు ఆర్పీలు కక్కుర్తిపడి, ఒక్కో సంఘానికి రుణం ఇప్పించే సమయంలో రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు మామూళ్లు తీసుకుంటున్నారే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి పలు మహిళా సంఘాలు సిద్ధమవుతున్నాయి.

> **విచారిస్తాం**
>
> మెప్మాలో జరుగుతున్న పలు విషయాలు ఇప్పుడే నా దృష్టికి వచ్చాయి. ఇక్కడ ఏం జరుగుతోంది..? అనేదానిపై విచారణ చేపడతాం. మహిళా సంఘాలు ఏ ఒక్కరికీ లంచాలు ఇవ్వాల్సిన పనిలేదు. ఏ చిన్న ఇబ్బంది వచ్చినా, నా దృష్టికి తీసుకురండి. సమాచారం ఇచ్చిన వాళ్ల వివరాలు గోప్యంగా ఉంచి, ఆరోపణలు వచ్చిన వారిపై నేరం రుజువైతే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – నరసింహ ప్రసాద్, కమిషనర్, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

క్లుప్తంగా

పక్కాగృహాలను సకాలంలో పూర్తి చేయాలి


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రెడ్డిబాబు, హౌసింగ్ అధికారులు

తవణంపల్లె: మండలంలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని పొన్నేడుపల్లె, దిగువ మొదలపల్లె కాలనీల్లో సోమవారం అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు పనులు చేపట్టని లబ్ధిదారుల స్థలాల పట్టాలను రద్దు చేస్తామన్నారు. పునాదులు వేసిన వారు గోడలు కట్టి మోల్డింగ్ వేయాలన్నారు. ప్రతి లబ్ధిదారునితో మాట్లాడి పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్ రేపు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు తెలపవచ్చన్నారు. సమస్యలను వినతి రూపంలో ఇవ్వాలని వివరించారు.

వైద్యసేవలపై కేంద్ర బృందం ఆరా


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న కేంద్ర బృంద అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం టెలిఫోన్ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం కేంద్ర బృంద అధికారి డాక్టర్ పర్వీన్ సుల్తానా తనిఖీ చేశారు. అలాగే సబ్‌సెంటర్లను సందర్శించారు. వివిధ జాతీయ కార్యక్రమాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణపై ఆరా తీశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని కుటుంబ నియంత్రణ రికార్డులు, ప్రసవానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మాతా శిశు సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని పనిచేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉషశ్రీ, హనుమంతరావు, జానకీరామ్, ప్రశాంతి, కేటీ ప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

గుడిపాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మొత్తం 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. మండల సర్వసభ్య సమావేశం జరగాలంటే కనీసం నలుగురు ఎంపీటీసీలు హాజరుకావాల్సి ఉంది. దీంతో కోరం లేకపోవడంతో మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ శివరాజన్ తెలిపారు.

జిల్లా పరీక్షల కమిటీలు ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా పరీక్షల కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఏపీ ఓపెన్ స్కూల్ రాష్ట్ర డైరెక్టర్ నరసింహారావు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి ప్రిన్సిపల్, జూనియర్ కళాశాల లెక్చరర్ కేడర్‌లో ఒకరు, ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి హెచ్ఎం, ఎస్ఏ కేడర్‌లో ఒకరిని నియమించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి పేర్లను ఖరారు చేసి, నివేదికలు పంపాల్సి ఉంటుందన్నారు. నియమితులయ్యే కమిటీ సభ్యులు ఓపెన్ స్కూల్ పరీక్షలను పర్యవేక్షిస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అధునాతన పరికరాలతో విద్యాబోధన

కార్వేటినగరం: అధునాతన సాంకేతిక పరికరాలతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాబోధనలు కొనసాగుతుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. సోమవారం కళాశాలలో ఓపెన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధునాతనమైన సాంకేతిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ విభాగం, లైబ్రరీ, వ్యాయామశాల, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన కంప్యూటర్ స్మార్ట్ బోర్డులు, విశాలమైన తరగతి గదులు, చదువుతోపాటు ఉద్యోగ సాధనకు అవసరమైన మెళకువలు కల్పించే జేకేసీ విభాగం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన వెంటనే ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు సిద్ధపడాలన్నారు. ఈ క్రమంలో భాగంగా ప్రిన్సిపల్ కళాశాలలోని అన్ని విభాగాలను సందర్శించారు.

అదృశ్యమైన ఆభరణం లభ్యం


బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న ఈవో

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలో సోమవారం బెంగళూరుకు చెందిన సౌజన్య బంగారు బ్రాస్‌లెట్ రింగ్‌ను పోగొట్టుకుంది. ఉదయం కొబ్బరికాయలు సమర్పించే ప్రాంతంలో మొక్కులు చెల్లించుకున్న సమయంలో తన చేతిలోని బంగారు ఆభరణం పడిపోయింది. దర్శన అనంతరం ఈవిషయం గమనించిన ఆ మహిళ దేవస్థాన అధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అధికారులు సిబ్బంది ద్వారా కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో గాలించారు. అక్కడే లభ్యమైన ఆ 17 గ్రాముల బంగారాన్ని ఈవో పెంచల కిషోర్ చేతుల మీదుగా మహిళలకు అందజేశారు.

10 నుంచి పది ప్రీ-ఫైనల్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ఈ నెల 10వ తేదీ నుంచి పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీన మొదటి ల్యాంగ్వేజ్, 11న మొదటి ల్యాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు), 12న సెకండ్ ల్యాంగ్వేజ్, 13న ఫస్ట్ ల్యాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్‌కోర్సు), 15న గణితం, 17న ఫిజికల్ సైన్స్, 18న బయాలజికల్ సైన్స్, 19న ఓఎస్ఎస్‌సీ మెయిన్ ల్యాంగ్వేజ్ పేపర్ 2, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు (థియరీ), 20వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి


మహిళలతో మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: నిరుపేదలకు నివాస స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. స్థానిక పీహెచ్‌వాడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు లేని వారి కోసం పార్టీ పిలుపు మేరకు బాధితుల వద్ద నుంచి దరఖాస్తులు రాయించామన్నారు. వీరితో కలిసి ఈనెల 10న చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రతి నిరుపేదకు స్థలాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, గోపినాథ్, మణి, దాసరి చంద్ర, విజయ గౌరీ, కుమారి, కవిత, విజయకుమార్, బాలాజీరావు, రోజా, దేవయాని తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రజల నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి, లేకపోతే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. శీతాకాలంలో చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం


గ్రామోత్సవంలో స్వామివారు

కాణిపాకం: వసంత పంచమిని పురస్కరించుకుని కాణిపాకంలోని శ్రీవరసిద్ధివినాయకస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి గ్రామోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తొలుత మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం జరిపించారు. అనంతరం విశేషంగా అలంకరించి వాహనంపై ఆసీనులు చేశారు. తర్వాత ఉత్సవమూర్తికి కర్పూర హారతులు పట్టి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఉభయదారులుగా అగరంపల్లి మోహన్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 37 ఫిర్యాదులు


ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చిత్తూరు అర్బన్: నగరంలోని జిల్లా ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమానికి 37 ఫిర్యాదులు అందాయి. సోమవారం డీఎస్పీ సాయినాథ్ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించేలా చూస్తామని డీఎస్పీ వివరించారు.

రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఐరాల: మండల పరిధిలోని బీసీ కాపు(బలిజ), ఈబీసీ కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాలకు చెందిన లబ్ధిదారులు సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ధనలక్ష్మి కోరారు. ఆమె సోమవారం మాట్లాడుతూ లబ్ధిదారులు గ్రామ సచివాలయాల ద్వారా, ఆయా కార్పొరేషన్‌లో బ్యాంకు లింకేజీ సబ్సిడీ రుణాల కోసం WWW.APOBMM.CGG.GOV.IN వెబ్‌సైట్‌లో ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలకు చెందిన వారు కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకొనే అభ్యర్థి వయసు 21 నుంచి 60 ఏళ్ల మధ్యలో, కాపు(బలిజ) కార్పొరేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి వయసు 21 నుంచి 50 సంవత్సరాల మధ్యలో ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఎంపీడీఓ కార్యాలయం లేదా గ్రామ సచివాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

బీసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు

తవణంపల్లె: మండలంలోని బీసీలకు బ్యాంకు లింకేజీ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండల పరిధిలోని బీసీ, కాపు(బలిజ), ఈబీసీ, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ కులాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులు సబ్సిడీ రుణాల కోసం ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎపిఓబిఎంఎం.సిజిజి.జిఓవి.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 7వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలానికి 80 యూనిట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. అర్హులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

చిత్తూరు అర్బన్: ప్రజా వేదికలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ అన్నారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజావేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఇంజినీరింగ్, టిడ్కో, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, మెప్మా విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. గ్రీవెన్స్‌లో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

500 పశువులకు లంపీస్కిన్

గుడిపాల: ముద్దచర్మ వ్యాధి కేసులు మండలంలో వరుసగా 500కు పైగా నమోదయ్యాయి. మరకాలకుప్పం, రెట్టగుంట, అనుపు, చిత్తపార, బండపల్లె, బసవాపల్లె, 189కొత్తపల్లె, చుక్కావారిపల్లె, 197రామాపురం, ఏఎల్‌పురం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో పాడి ఆవులకు ముద్దచర్మ (లంపీ స్కిన్)వ్యాధి సోకింది. పశువైద్యులు ఆ పశువులకు వాటన్నింటికీ ప్రస్తుతం చికిత్సలు చేయడం ప్రారంభించారు, ఎక్కడైనా ఈ వ్యాధులు సోకిన వెంటనే తమకు తెలియజేయాలన్నారు.

పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం


పుణ్యసముద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ


మల్లకుంటలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: పల్లె ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని గ్రామాల్లో ఇంటింటికీ వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లకుంటలో ఫ్యామిలీ డాక్టర్


మండలంలోని మల్లకుంటలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

వినతులు పరిశీలించి న్యాయం చేయండి


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: వినతులు పరిశీలించి....న్యాయం చేయాలని అర్జీదారులు వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితులు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఇప్పటికి ఎన్ని సార్లో..



ఎన్ని సార్లు రెవెన్యూ అధికారులకు అర్జీ ఇచ్చినా న్యాయం మాత్రం జరగడం లేదని వి.కోట మండలం తోటకనుమ పంచాయతీ మోర్లపల్లెకు చెందిన వజ్రవేలు శెట్టి వాపోయారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 1.69 ఎకరాల భూమి ఉందన్నారు. ఆ భూమిని 1963లో తమ పూర్వీకులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వెంకట్రామప్ప, వెంకటేశు, అశోక్, నరేష్ ఆ భూమికి దారి వదలకుండా ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. 15 ఏళ్లుగా న్యాయం కోసం తిరుగుతూనే ఉన్నట్లు తెలిపారు. ఎన్ని వినతులు ఇచ్చినా న్యాయం చేయడం లేదన్నారు. కలెక్టర్ చెప్పినా మండల అధికారులు స్పందించడం లేదని చెప్పారు.

వితంతు పింఛన్ కోసం తిరుగుతున్నా



వితంతు పింఛన్ కోసం చాలా నెలల నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నట్లు చిత్తూరు తోటపాళ్యానికి చెందిన పయనియమ్మ అన్నారు. వితంతు పింఛన్ మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చాలా నెలలుగా వితంతు పింఛన్ కోసం వేడుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తన భర్త మృతి చెందడంతో జీవనాధారం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వితంతు పింఛన్‌ను మంజూరు చేయాలని కోరారు.

దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలి



దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని పెనుమూరు మండలం కేపీ పల్లికి చెందిన రోజా వాపోయారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ తనకు, తన కుమారుడికి రోడ్డు ప్రమాదంలో గాయాలవడంతో రెండు కాళ్లు తీసేశారన్నారు. అధికారులు స్పందించి దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని కోరారు.

నాకు న్యాయం చేయాలి



దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని చిత్తూరు నగరం 46వ వార్డు ఓబనపల్లెకు చెందిన వీరయ్య కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పింఛన్ కోసం చాలా సార్లు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తన పేరుతో ఎలాంటి ఆస్తులు లేవన్నారు. అయినప్పటికీ పట్టణ ఆస్తులు ఎక్కువ ఉన్నట్లు చూపుతోందన్నారు. పింఛన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో తప్పులతడకగా వివరాలు చూపిస్తున్నట్లు చెప్పారు. అధికారులు పరిశీలించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ల్యాబ్ పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ పేర్కొన్నా రు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ల్యాబ్ టెక్నిషియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్కడక్కడ డెంగీ కేసులు నమోదువుతున్నాయన్నారు. దీంతో ల్యాబ్‌టెక్నియన్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ.. ఆస్పత్రికి వచ్చే వారికి విధిగా వైద్యపరీక్షలు చేసేలా చూడాలన్నా రు. వాటి ఫలితాలు త్వరితగతిన అందిస్తే.. వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం ఎయిడ్స్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధి కారి వేణుగోపాల్ పాల్గొన్నారు.